



| | |
|---|---|
| ఎన్నికలు జరిగే ఉమ్మడి జిల్లాలు : | 4 |
| కొత్త జిల్లాలు : | 15 |
| అసెంబ్లీ నియోజకవర్గాలు : | 43 |
| గ్రాడ్యుయేట్ ఓటర్లు : | 3,55,159 |
| టీచర్ ఓటర్లు : | 27,088 |
| పోలింగ్ కేంద్రాలు : | 773 |
| పోలింగ్ : | నేటి ఉదయం 8 నుంచి సాయంత్రం గంటల 4 వరకు |
| ఓట్ల లెక్కింపు : | మార్చి 3న |


కరీంనగర్‌లో సామగ్రి సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

# నేడే ఎమ్మెల్సీ పోరు

**పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల ఎన్నికలకు సర్వం సిద్ధం**




**శాసనమండలి పోరుకు సర్వం సిద్ధమైంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు సంబంధించిన ఎన్నికలకు యంత్రాంగం రెడీ అయింది. నేటి ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుండగా, అందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. గ్రాడ్యుయేట్ స్థానానికి 3,55,159 మంది, టీచర్ స్థానానికి 27,088 మంది ఓటు వేయనుండగా, అప్పుడే అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. వచ్చే నెల 3న భవితవ్యం తేలనుండగా, అప్పటిదాకా ఉత్కంఠ కొనసాగనున్నది.**

- ఉమ్మడి నాలుగు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- గ్రాడ్యుయేట్ స్థానానికి 56 మంది, టీచర్ స్థానానికి 15 మంది పోటీ
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- కేంద్రాలకు తరలిన సిబ్బంది
- ఓటేసేందుకు గుర్తింపుకార్డు తప్పనిసరి
- ప్రభుత్వోద్యోగులకు నేడు ప్రత్యేక సెలవు

కరీంనగర్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) / కరీంనగర్ కలెక్టరేట్ : కరీంనగర్– ఆదిలాబాద్– మెదక్– నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు నేడు ఎన్నికలు జరగునున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, అందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. పట్టభద్రుల స్థానానికి మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా.. 3,55,159 మంది ఓటర్లున్నారు. అలాగే ఉపాధ్యాయ స్థానానికి 15 మంది బరిలో ఉండగా.. 27,088 మంది ఓటర్లు ఉన్నారు. 15 కొత్త జిల్లాలు, 271 మండలాల పరిధిలో ఈ ఎన్నికలు నిర్వహిస్తుండగా, ప్రతి మండల కేంద్రంతో పాటు మున్సిపాలిటీల్లో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించి 499, టీచర్స్‌కు సంబంధించి 274 మొత్తం ఈ రెండు స్థానాలకు 773 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్‌కు అవసరమైన సామగ్రి ఇప్పటికే ఆయా జిల్లాలు, మండలాలు, అలాగే పోలింగ్ కేంద్రాలకు పంపించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 4,199 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. అందులో భాగంగా 394 మంది మైక్రో అబ్జర్వర్లు, 335 మంది జోనల్ అధికారులు, 864 మంది ప్రిసైడింగ్, 2,606 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఈ ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రం వివరాలతో కూడిన పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌లో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రానికి తెచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్సులను అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచేలా పటిష్ట ఏర్పాట్లు చేశారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం మధ్యాహ్నం రిటర్నింగ్ ఆఫీసర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా పీవోలు, సిబ్బంది, ఇతర అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇటు ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.


కరీంనగర్‌లో పోలింగ్ సామగ్రి సరిచూసుకుంటున్న అధికారులు

### గుర్తింపుకార్డు తప్పనిసరి

మండలి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏదేని ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపాల్సి ఉంటుంది. అందుకు ఓటరు గుర్తింపుకార్డుతోపాటు ఎన్నికల సంఘం 12 రకాల గుర్తింపుకార్డులను సూచించింది. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్, ఉపాధి హామీ జాబ్ కార్డులలో ఏదైనా ఒక కార్డు చూపాలని చెప్పింది.

### నేడు ప్రత్యేక సెలవు

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నమోదిత ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు గురువారం ప్రత్యేక సెలవు వర్తింపజేస్తున్నట్టు రిటర్నింగ్ ఆఫీసర్ పమేలా సత్పతి తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అథారిటీల్లో పని చేస్తూ పట్టభద్రుల ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి ఇవ్వాల ని, అందుకు అవసరమైన వెసు లుబాటు కల్పించాలని సూచించారు.







# ప్రగతిని ఆపొద్దు

- ప్రభుత్వం మారితే నిర్లక్ష్యం చేస్తారా?
- వేములవాడ అభివృద్ధిని కొనసాగించాలి
- బీఆర్ఎస్ కార్యకర్తలపై వేధింపులు ఆపాలి
- కేటీఆర్ ఫొటో పెట్టుకుంటే టీ స్టాల్‌నే తీసేస్తారా..?
- సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకోవాలి
- వేములవాడలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- రాజన్న సన్నిధిలో పూజలు


వేములవాడ రాజన్న సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు


వేములవాడ రాజన్న ఆలయంలో ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ వినోద్ కుమార్

వేములవాడ, ఫిబ్రవరి 26: ప్రభుత్వాలు మారినంత మాత్రాన ప్రగతిని ఆపొద్దని, వేములవాడలో అభివృద్ధిని కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ వేధింపులు పెరిగిపోయాయని, సిరిసిల్లలో కేటీఆర్ ఫొటో పెట్టుకున్నందుకు నిరుపేద టీ స్టాల్ ను తీసేయించిన దుర్మార్గపు సర్కారు కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఇంత భేదభావం అక్కరలేదని, తక్షణమే ఇలాంటి కక్షపూరిత వ్యవహారాలను విరమించుకోవాలని, బీఆర్ఎస్ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని హితవు పలికారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం వేములవాడ రాజరాజేశ్వర స్వా మి వారిని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమా ర్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. తెలంగాణకు కొంగుబంగారం లాంటి రాజరాజేశ్వర స్వామివారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. వేములవాడ అభివృద్ధికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని, బీఆర్ఎస్ హయాంలో రూ. 250 కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. ప్ర భుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. బీఆర్ఎస్ హయాం లో రాజన్న ఆలయ విస్తరణ కోసం గుడి చెరువు వద్ద 30 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆలయానికి అందించిందని, ప్రస్తుతం అక్కడ అభివృద్ధి జరుగడం లేదని స్థానికులు చెబుతున్నారని, వెంటనే పనులను కొనసాగించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సిరిసిల్ల జిల్లా అంటేనే చేనేత జిల్లాగా పేరు పొందిందని, చేనేత కార్మికుల కోసం నాడు మంత్రిగా కేటీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం లేదని, ఫలితంగా సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను ప్రభుత్వం సమానంగా చూడాలని సూచించారు. చేనేత కార్మికులను ఆదుకోవాలని, అండగా నిలబడాలని డి మాండ్ చేశారు. అంతకు ముందు రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆమెకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్ర ఆనంద్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, న్యాలకొండ అరుణ, దావ వసంత, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, మాజీ ఎంపీపీలు చంద్రయ్య గౌడ్, గంగమ్ స్వరూప, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, తదితరులు ఉన్నారు.

# హర హర మహాదేవ

- వైభవంగా మహా శివరాత్రి వేడుకలు



కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 26: శివనామస్మరణతో ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలు మారుమోగాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేములవాడ రాజన్న క్షేత్రంతోపాటు పెంబట్ల దుబ్బ రాజేశ్వర దేవాలయం, పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి దేవాలయం, కోటిలింగాల, ఓదెల మల్లన్న, జనగామ త్రిలింగేశ్వరాలయం, కరీంనగర్‌లోని పాతబజారు శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గంటల కొద్దీ క్యూలైన్లలో నిల్చొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. వేములవాడ రాజన్న సన్నిధికి భక్తులు పోటెత్తారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 2లక్షలకుపైగా మంది తరలివచ్చారు. గంటల తరబడి క్యూ లైన్లలో ఉండి మరీ స్వామివారిని దర్శనం చేసుకున్నారు.


కరీంనగర్ కమాన్ సమీపంలోని రామేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు